క్లుప్తంగా...

నేడు బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో నేడు ప్రజా ఆశీర్వాదసభ నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. పట్టణంలో ఉదయం 9గంటలకు వివేకానంద విగ్రహం వద్ద సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు ముందు పట్టణంలో ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తుండగా ర్యాలీకి బీఆర్ఎస్ మేడ్చల్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి హాజరవుతారని చెప్పారు.

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు ఏవీ?

మేడ్చల్: జిల్లాలోని సర్పంచ్‌లకు పంచాయత్ రాజ్ చట్టం అందరికీ సమానంగా వర్తించదా అని బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మేడ్చల్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ కలెక్టర్, పంచాయతీ అధికారులు గతంలో మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామ సర్పంచ్‌ను రూ.8 లక్షలు దుర్వినియోగం చేస్తే సస్పెండ్ చేశారని, గౌడవెల్లి సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ దాదాపు రూ.40 లక్షలు దుర్వినియోగం చేసినట్లు అధికారులు తేల్చినా ఆయనకు కేవలం నోటీసు ఇచ్చి డబ్బులు జమ చేయాలని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా పంచాయతీ అధికారులు నూతన కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి సర్పంచ్‌కు అండగా నిలిచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు లేకుండా చేస్తున్నారని అన్నారు. ఈవిషయంపై సీఎస్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కీసరగుట్ట దేవాలయం మూసివేత



కీసర: చంద్రగ్రహణం కారణంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం మధ్యాహ్నం 1గంట నుంచి ఆదివారం ఉదయం వరకు మూసి వేస్తామని కీసరగుట్ట వేదపండితులు, ఆలయ చైర్మన్ తటాకం రమేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం స్వామివారికి నిత్యపూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 1 గంట సమయంలో దేవాలయాన్ని మూసేశారు. తిరిగి ఆదివారం ఉదయం దేవాలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం ఉదయం 8గంటల తర్వాత భక్తులను అనుమతిస్తామన్నారు.

పరామర్శ



మృతురాలి కుటుంబీకులను పరామర్శిస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఈడబ్ల్యూఎస్ కాలనీలో మూడు రోజుల క్రితం కీసరగుట్ట మాజీ డైరెక్టర్ నరేశ్‌గౌడ్ సోదరుడి కూతురు భావన అనారోగ్యంతో మృతిచెందింది. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మృతురాలి నివాసానికి శనివారం వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ బూత్ సమావేశాలు

నిజాంపేట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్‌పార్టీ బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశాలకు ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండుముదిరాజ్, బీఆర్ఎస్ ప్రెసిడెంట్ రంగరాయప్రసాద్ హాజరు కానున్నారు. ఉదయం 8 గంటలకు 20వ డివిజన్ పూజిత ఎన్‌క్లేవ్‌లో, 8.30కు 17వ డివిజన్ మా విల్లాస్‌లోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద, ఉదయం 9 గంటలకు 18వ డివిజన్ సాయిఅనురాగ్ కాలనీలో, 10 గంటలకు 1వ డివిజన్ ప్లెసెంట్ విల్లా క్లబ్ హౌస్‌లో, 11 గంటలకు 2వ డివిజన్ పరిధి గణపతి ఆలయం వద్ద, 11.30 గంటలకు 22వ డివిజన్ సాయిభాస్కర్ హబ్, చత్రపతి శివాజీ పార్క్ వద్ద సమావేశాలు జరుగుతాయి.

ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు..

అడ్డగోలుగా ప్రచారాలు.. జోరుగా వ్యక్తిగత ఆరోపణలు

- ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లుగా చూపుతూ ప్రచారం
- కోడ్‌ను పట్టించుకోని సోషల్ మీడియా సైనికులు




ఒకే పోస్టులో రెండు భిన్న ప్రచారాలు

మేడ్చల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియాలో రాజకీయ ప్రచారాలు అడ్డగోలుగా చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నా వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. తాము సమర్థించే పార్టీలు, అభ్యర్థుల కోసం ఇష్టానుసారంగా ప్రచారాలు చేస్తూ సోషల్ మీడియాను ఫాలో చేసే వారికి చిర్రెత్తిస్తున్నారు. ఎవరికి ఇబ్బందులు లేకుండా తమ ప్రచారం తాము చేసుకోవాలని నిబంధనలు ఉన్నా అడ్డూ అదుపు లేని సోషల్ మీడియాలో పోస్టింగ్‌ల జోరుగా కనిపిస్తోంది.

ప్రత్యేక గ్రూపులు..

ఎన్నికల ప్రచారంతో పాటు ఎన్నికల్లో మీడియా ప్రభావం ఎక్కువగా ఉండటంతో సోషల్ మీడియాను నేటి రాజకీయ నాయకులు ఎక్కువగా వాడుకుంటున్నారు. ప్రధానంగా వాట్సాప్, ఫేస్‌బుక్‌లను ఎక్కువగా వాడుతున్నారు. యూట్యూబ్‌కు కొంతవరకు నియంత్రణ ఉంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ పరిధిలో ఉండే ఓటర్ల నంబర్లు సేకరించి గ్రూపులుగా తయారు చేస్తున్నారు. మా ఊరు, మన వార్డు, మన కాంగ్రెస్, మన బీజేపీ, మన బీఆర్ఎస్, జంగయ్య సైన్యం, మల్లారెడ్డి సైన్యం, మున్సిపాలిటీ, మండలం, నియోజకవర్గం ఇలా వార్డు స్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు గ్రూపులు ఏర్పాటు చేసి వాటి ద్వారా జోరుగా ప్రచారం చేస్తున్నారు. వారు పెట్టే పోస్టింగ్‌లు నిజమో కాదో ఎవరికీ తెలియదు.. కానీ చక్కర్లు మాత్రం జోరుగా కొట్టిస్తున్నారు. ఓ ప్రముఖ సర్వేలో మా అభ్యర్థికి 70శాతం మంది ఓటర్లు మొగ్గుచూపారని, గెలుపుమాదే అని ప్రచారాలు జోరుగా చేసుకుంటున్నారు. ఆ సర్వే ఎవరూ చేశారు, ఏ సంస్థ చేసింది పోస్ట్ పెట్టిన వాడికే తెలియదు. అభిమానం కట్టలు తెంచుకుని ఉండటంతో వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేయడం ఫేస్‌బుక్‌లో షేర్ చేయడమే వారి పని.



సోషల్ మీడియాలో నాయకుల ప్రచారం పోస్టింగ్‌లు

ప్రత్యేకంగా పని..

సోషల్ మీడియా ప్రభావం సమాజంపై ఎక్కువగా ఉండటంతో ప్రచారంలో నాయకులు దానిపై ఆధారపడుతున్నారు. వీటీ కోసం స్థానికంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఫొటోలు పెట్టి అందంగా మేకప్ చేసి సందేశాలను విడుదల చేస్తున్నారు. ఒక్కో మెసేజ్‌కు రూ.30, వీడియోకు రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. చాలామందికి ఇదో రకం ఉపాధిగా మారింది. ఫొటోలు పెట్టుకొని గ్రూపుల్లో ప్రచారాలు చేయడం, వాట్సాప్‌లలో పెట్టడం, స్టేటస్ పెట్టుకోవాలని సూచించడం వంటి మెసేజ్‌లు ఎన్నో కనిపిస్తున్నాయి. ఎన్నికలకు నెల రోజుల సమయం ఉన్నా సోషల్ మీడియాలో ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. ఇప్పుడే ఇలా ఉంటే ఎన్నికలు దగ్గర పడితే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు అంటున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్

జంగ్ తెలంగాణ 2023

కీసర: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం చీర్యాల చౌరస్తాలోని జయమోహన్ గార్డెన్‌లో నిర్వహించిన ఉమ్మడి కీసర మండల కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, రాష్ట్రనేత నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి ఐదేళ్లుగా నియోజకవర్గంలో ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. సొంత ఆస్తులు పెంచుకునేందుకు భూదందాలు, సెటిల్‌మెంట్లు, లిటిగేషన్ భూములను కొనుగోలు చేయడం పెట్టుకున్నారన్నారు. తెలంగాణలోనే పేరుపొందిన కీసరగుట్ట దేవాలయ అభివృద్ధికి ఒక్క రూపాయి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించలేదన్నారు. సుమారు 650 మంది వరకు కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, ముప్ప రామారావు, కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తటాకం అభిలాష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి, కౌన్సిలర్లు పంగ హరిబాబు, గోగుల సరితావెంకటేష్, పంబాల సరితారమేష్, ముప్ప శ్రీలత, నేతలు సామల శ్రీనివాస్‌రెడ్డి, సోమేష్, తటాకం వెంకటేష్, పద్మనాగభూషణం, మాజీ ఎంపీపీ చిన్నమరాజు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

పోచారం: ఉద్యమ స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో డబ్బుకు సీట్లు అమ్ముకునే సంస్కృతి ఎందుకు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం అన్నోజిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐదేళ్ల గడిచినా మంత్రి మల్లారెడ్డి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరానన్నారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేసి, మల్లారెడ్డికి ఎన్నికల్లో డిపాజిట్ దక్కకుండా చేయాలని, అందుకు కార్యకర్తలకు అహర్నిశలు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, రాపోలు రాములు, కర్రె రాజేష్, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కట్ట జనార్దన్‌రెడ్డి, కొంతం అంజిరెడ్డి, బాలగోని చిన్న నర్సింహులు గౌడ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, కందుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సాఫీగా సాగేలా..

- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి పనిని జాగ్రత్తగా, పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి జాప్యం లేకుండా నివేదికలు సమర్పించడం, చర్యలు తీసుకోవడం సక్రమంగా చేపట్టాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని శిక్షణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ - ఎంసీసీ), జిల్లా గ్రీవెన్స్ కమిటీ, పోస్టల్ బ్యాలెట్, లా అండ్ ఆర్డర్, మీడియా మానిటరింగ్ (ఎంసీఎంసీ), స్వీప్ అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన మేరకు నియోజకవర్గంలో అన్ని బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఎన్నికల కేంద్రాల్లో ఏమైనా పనులు చేపట్టాల్సిన ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి



మేడ్చల్‌రూరల్: ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ హనుమాన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

ఫిర్యాదుదారులను బెదిరించిన కేసులో ఐదుగురి రిమాండ్

కంటోన్మెంట్: ఫిర్యాదుదారులను బెదిరించిన కేసులో ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి వెల్లడించిన వివరాల ప్రకారం.. మారేడుపల్లికి చెందిన సన్నీ యాదవ్‌పై గత జూన్‌లో సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదై రిమాండ్‌కు తరలించారు. తాజాగా సన్నీ యాదవ్, మారేడుపల్లికి చెందిన గొల్ల కిట్టు, విశ్వేందర్, రవీందర్ రెడ్డి, చంద్రప్రభు, వీరబాబులతో కలిసి సందీప్‌తో పాటు అతని మిత్రుడు అజయ్‌ను కిడ్నాప్ చేశారు.గతంలో సన్నీయాదవ్‌పై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి చేయడంతో పాటు ఇద్దరిపై దాడి చేశారు. కేసు వెనక్కి తీసుకోకుంటే చంపేస్తామని బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న చందనా దీప్తి

తొలిరోజు సెట్ ప్రశాంతం

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్–2023 తొలి రోజు ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 35 కేంద్రాలలో జర్నలిజం, మేనేజ్‌మెంట్, లైఫ్ సైన్సెస్ సబ్జెక్టులకు జరిగిన మొదటి విడత పరీక్షకు 76.85 శాతం, రెండో విడత పరీక్షకు 81.20 శాతం హాజరైనట్లు వివరించారు. టీఎస్‌సెట్–2023 చైర్మన్, ఓయూ వీసీ ప్రొ.రవీందర్ మొదటి విడత పరీక్ష ప్రశ్నపత్రం కోడ్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 30 వరకు సెట్ పరీక్షలు జరుగనున్నాయి.

బీసీ సీఎం ప్రకటన హర్షణీయం

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీల పక్షపాతి బీజేపీ అని ఆ పార్టీ యువ నాయకులు, ఓయూ జేఏసీ చైర్మన్ ఎనుగంటి రాజునేత పేర్కొన్నారు. పార్టీలో బీసీలకు పెద్దపీట వేయడంతో పాటు ఏకంగా తెలంగాణ రాష్ట్రానికి సీఎంగా బీసీని ప్రకటించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గత 75 ఏళ్లలో ఏ ఒక్క పార్టీ కూడా బీసీని ముఖ్యమంత్రిగా ప్రకటించలేదన్నారు. సూర్యాపేట సభలో అమిత్ షా బీసీ నేతను సీఎంగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్ రమేష్

క్రీడలతో మానసిక ప్రశాంతత

జవహర్‌నగర్: క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతకు దోహదపడతాయని రణ్‌వీర్ తైక్వాండో మాస్టర్ రమేష్ అన్నారు. జవహర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కరాటే పోటీల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలం ఆశావహుల్లో.. టెన్షన్.. టెన్షన్

- అచితూచి.. అడుగులేస్తున్న బీజేపీ అధిష్టానం
- కుత్బుల్లాపూర్‌లో కూన శ్రీశైలంగౌడ్ మాత్రమే ఖరారు
- ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కూకట్‌పల్లిపై ఉత్కంఠ

సాక్షి, మేడ్చల్ జిల్లా: అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించడంతో వారు ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించారు. బీఆర్ఎస్ అభ్యర్థులు రెండో దఫా ప్రచారంలోకి అడుగుపెట్టగా.. కాంగ్రెస్ అభ్యర్థులు తమ ప్రచారంలో జోరు పెంచారు. బీజేపీ మాత్రం జిల్లాలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను మాత్రమే ప్రకటించగా, ఆయన ప్రచార పర్వంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్తున్నారు. అయితే.. మిగిలిన నాలుగు ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను ప్రకటించకపోవడంతో.. ఆశావహుల్లో టెన్షన్ పెరుగుతోంది.

అభ్యర్థుల ఎంపికపై అచితూచి అడుగులు..

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా.. మహిళా బిల్లు ఆమోద అంశం.. నిరుద్యోగులకు సంబంధించి ఉద్యోగ నియామకాలు.. నోటిఫికేషన్ల విడుదలపై నగరంతో సహా శివారు జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన బీజేపీ అభ్యర్థుల ఎంపికపై అచితూచి అడుగులేస్తోంది. అధికార బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కమలనాథుల జాబితా ఉండేలా.. అధిష్టానం కసరత్తు చేస్తుండటంతో ఆశావహుల్లో టెన్షన్ పెరుగుతోంది. త్వరలో విడుదలయ్యే జాబితాలో తమ పేర్లు ఉంటాయో.. లేవోనన్న ఉత్కంఠ కూడా వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. పార్టీకి బాగా పట్టున్న నియోజకవర్గాల్లో ఆశావహుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతో.. బీజేపీ నాయకత్వం గెలుపు లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించడంతో పాటు.. అవసరమైతే కొత్త వారికి కూడా అవకాశం కల్పించాలన్న యోచనతో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

గెలుపు గుర్రాలకు మాత్రమే..

జిల్లాలో కూకట్‌పల్లి నుంచి వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, మాధవరం కాంతారావు, మేడ్చల్‌లో రూరల్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, మోహన్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.రవీందర్ గౌడ్ ఉప్పల్‌లో ఎన్ఎస్ఎస్ ప్రభాకర్ లేదా రాజకీయ సమీకరణలో భాగంగా కొత్తగా మరో ఇద్దరి నాయకులు పేర్లు తెరపైకి వస్తున్నాయి. మల్కాజిగిరి నుంచి మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, బీజేవైఎం జాతీయ కోశాధికారి టీంసాయి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే.. గెలుపు గుర్రాలకు మాత్రమే టికెట్లు ఇవ్వాలన్న యోచనతో ఉన్న కమలం పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంలో అచితూచి అడుగులు వేస్తుండటంతో ఆలస్యం జరుగుతోందన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఐ బొటిక్ ప్రారంభం



గచ్చిబౌలి: ఇప్పటి వరకు మార్కెట్‌లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సందడి చేశాయి, ఇప్పుడు కొత్తగా ఐబొటిక్ లగ్జరీ సన్ గ్లాసెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. హైటెక్‌సిటీ ప్రాంతంలో నిర్వాహకులు డాక్టర్ జగదీశ్‌రెడ్డి, ప్రణతిరెడ్డి, డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో ఈ బొటిక్‌ను సినీ ప్రముఖులు, మోడల్స్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ లగ్జరీ బ్రాండ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

మహిళ ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదయ్యనగర్‌లోని గాస్మండిలో రమేష్, భార్య రజిని(49), కుమారుడితో కలిసి ఉంటున్నారు. రమేష్ గత కొన్ని ఏళ్ల నుంచి బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. ఓ ప్రైవేటు బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేసే రజిని మూడు నెలల నుంచి ఉద్యోగానికి వెళ్లకుండా భర్త బాగోగులు చూసుకుంటూ ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఏమి చేయలేని పరిస్థితుల్లో శుక్రవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టు పక్కల వారు గమనించి గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

జవహర్‌నగర్ సమస్యలు గాలికి..


- ఏళ్లుగా సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి మరిచిన మంత్రులు
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రోజ్ గార్డెన్‌లో జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి నియంతగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. జవహర్‌నగర్ అంటేనే మినీ భారత్ అని, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలతో పాటు దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు నివసిస్తున్నారన్నారు. జవహర్‌నగర్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా డంపింగ్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, నాయకులు కల్లెపల్లి సదానందం, కన్నయ్యరాజు, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

8వ వార్డులో బీఆర్ఎస్ బూత్ కమిటీల ఏర్పాటు



8వ వార్డు బీఆర్ఎస్ బూత్‌కమిటీ

మేడ్చల్: పట్టణంలోని 8వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు బూత్ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ నెలరోజుల పాటు నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, విజయారావు, సంతోష్, రమేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న గజల్ కచేరి

సనత్‌నగర్: బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రముఖ గజల్ సంగీతకారుడు తలత్ అజీజ్ మ్యూజికల్ గజల్ కచేరి ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున ప్రేక్షకులు హాజరయ్యారు. పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జాగిర్దార్ కాలేజ్, ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమంలో తలత్ అజీజ్ గజల్స్‌తో ఉర్రూతలూగించారు.

ఓయూలో పుస్తక ప్రదర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని యూనివర్సిటీ లైబ్రరీ ఆధ్వర్యంలో జరిగిన ఐక్య రాజ్య సమితి 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ డాక్టర్ చక్రవర్తి, అధ్యాపకులు డాక్టర్ యాదగిరి, డాక్టర్ అనీల కుమారి ప్రసంగించారు.